> నా బాల్యాన్ని కేవలం డాక్యుమెంట్‌గానే కాకుండా-
> రేపటిని విజువలైజ్ చేసి ఈ కథ చెప్పాను.
> ఆ రేపు మీద, నాకు వ్యక్తిగా కథకునిగా ఆశ ఉంది.

జాన్‌సన్ చోరగుడి

# 1

# చివరి చర్మకారుడూ లేడు...





“సోగ్గాడు శోభనాద్రి ఇక్కడ... నేను ఇక్కడ, మీకు నాకు ఉన్నంత ఎడం కూడా ఉండదు, అంత దగ్గరగా చూసేవోణ్ని. ఒక్కరోజా రెండు రోజులా, ఏకంగా పదిరోజులుపైనే షూటింగు. అన్ని రోజులూ అందరం ఇక్కడే, ఈ మంటపాలు సెంటర్లోనే...”

బయలుదేరిన దగ్గర నుంచి మాట్లాడుతూనే ఉన్నాడేమో, అతిథి కొంచెం ఆసక్తిగా తనను చూస్తున్నాడని గమనించాక, అప్పుడు హనుమంతు తన మాటలు ఆపాడు.

ఫోను మాట్లాడి...

“బాబు ఫోన్ చేశారండి, ఆరికి భోజనాలు లేటవుతుంది త్వరగా వచ్చెయ్యమని, వెళ్దాం పదండి,” అన్నాడు.

ఇద్దరూ ఇంటి వైపు నడుస్తున్నారు.

డాక్యుమెంటరీ సినిమా డైరెక్టర్ అరవిందరావు ఆ రోజు ఉదయమే ఆ ఊరు వచ్చాడు. ఒక మిత్రుడుతో తన ప్రాజెక్టు గురించి చెప్పి ఈ ప్రాంతానికి వెళ్లాలనుకుంటున్నట్టు అన్నాడు. అప్పుడు అతను ఈ ఊరు గురించి చెప్పి- ఈ హనుమంతు వాళ్ల బాసు ప్రతాపచంద్ర వాళ్లింట్లో తనకు బస ఏర్పాటుచేశాడు. కెమేరామెన్ మణి, అసిస్టెంట్ డైరెక్టర్ వాసు మధ్యాహ్నం తర్వాత వస్తారు.

“ఒకసారి ఊరు చూసి వస్తాను,” అనడంతో పనివాడు హనుమంతును ప్రతాపచంద్ర తనతో పంపాడు. అరవింద్ తాజా సినిమా ‘క్రానికల్స్ ఆఫ్ ఎ టెంపుల్ స్కల్ప్చర్’కు నేషనల్ పానరామాలో మూడు అవార్డులు వచ్చాయి. దాంతో, అదే టీంతో తర్వాత సినిమా కోసం సబ్జెక్టు వెతుకులాటలో తను ఇప్పుడా పల్లెటూళ్లో ఉన్నాడు.

జమిందారీవంటిదేమీ లేదుగాని, ప్రతాపచంద్ర కుటుంబ నేపథ్యం అటువంటిదే. అతని తాత నిర్మించిన భవంతి అది. వాళ్లు మొత్తం తొమ్మిదిమంది. మిగతా వాళ్లంతా నగరాల్లో ఏవేవో వ్యాపారాల్లో తలమునకలై ఉంటారు. ప్రతాప్ మాత్రం ఎమ్మెస్సీ ఫిజిక్స్ చేసి, యూనివర్శిటీ చదువులు పూర్తి అయ్యాక- కుటుంబంతో ఊళ్లోనే ఉండి భూములు, వ్యవసాయం చూసుకుంటున్నాడు. ఆ ఊళ్లో

వాళ్లదే పెద్ద వ్యవసాయం. పిల్లలు ఇద్దరూ పెళ్లిళ్ల తర్వాత అమెరికాలో సెటిలై పోయారు. ఇంట్లో ఉండేది భార్యభర్తలు ఇద్దరే, అయినా వచ్చేపోయే అన్నదమ్ములు కోసం, మూడు తరాలుగా ఆ ఇల్లు ఎప్పుడూ ఒకే మాదిరిగా ముస్తాబై ఉంటుంది. పైన రెండవ అంతస్తు మీద ఉన్న గెస్ట్‌రూంలో అరవింద్ బృందానికి బస ఏర్పాటు చేశారు. సాయంత్రం టీ తాగుతూ పైనుంచి క్రింద భవంతి వెనక పెరట్లో హడావిడి చూసి ఆసక్తిగా వాళ్లు అక్కడికి వచ్చారు.

అక్కడ కొలిమి ఒకటి ఏర్పాటు చేసి కొడవళ్లకు కక్కు(పదును) పెడు తున్నారు. పెద్దవయస్సు ఉన్న ఓ ముస్లిం వద్ద నలుగురు కుర్రాళ్లు ఆ పని చేస్తున్నారు.

అరవింద్ వాళ్లను చూసి హనుమంతు వాళ్లకు అక్కడ కుర్చీలు తెచ్చివేశాడు. అప్పటికే అక్కడ ఓ అరవై యేళ్ల వ్యక్తి పువ్వుల లుంగీ, పైన షర్టుకు మూడు గుండీలు తీసి కూర్చుని అన్నీ తానై హడావిడి చేస్తున్నాడు.

"హరిబాబు." అని తనని పరిచయం చేసుకున్నాడు. ప్రతాపచంద్ర పన్లు అన్నీ తానే చూస్తుంటానని అన్నాడు. ఉన్నట్టుండి మొదలెట్టాడు.

"వందెకరాల వ్యవసాయమండీ, ఏటా వరికోతలు వచ్చినయ్యంటే ఇదిగో ఈ సాయిబు కొలిమి తప్పదు మాకు. ఆడంగులు కోతలకొస్తారా, పంతులమ్మల్లాగా చేతులూపుకుంటూ రావడమే.  ఇదిగో కొడవళ్లు ఎత్తుకెళ్లి చేతికందిస్తే, అప్పుడుగాని చేలోకి దిగరు."

హనుమంతు తంపట వేరుసెనగకాయలు పళ్లాల్లో తెచ్చి వాళ్లకు ఇస్తున్నాడు. అతను అటూ ఇటూ తిరుగుతూ జుట్టును వెనక్కి లాగి కట్టిన అసిస్టెంట్ డైరెక్టర్ వాసు పోనీటెయిల్‌ను అనుమానంగా చూస్తున్నాడు.

వాళ్లంతా కబుర్లలో ఉండగా, హనుమంతు వచ్చి, "పని ఆగిపోయింది," అన్నాడు.

"అదేంట్రా!" హరిబాబు కంగారుపడ్డాడు. మర్నాడు కోత.

"కొలిమికి గాలి కొట్టే తోలుతిత్తి అంచు చిరిగిందంట, గాలి పోవట్లేదు, కొలిమి ఆరిపోయింది."

"ఏంటి వహాబూ ఇదేం కొలువయ్యా స్వామీ, మంచి ఫిట్టింగ్ పెట్టావుగా."

పెద్దవాడని, చిరాకు కన్పించకుండా తన అసహనం తెలిపాడు హరిబాబు.

"దానియేలును పిలిపించండి బాబు, చిటికెలో కుట్టేస్తాడు," వహాబు అన్నాడు.

ప్రతాపచంద్ర వస్తూ, "హరీ! బైక్ తీసుకుని ఆ కుర్రాణ్ని ఒకడ్ని తీసుకుని ఆ తిత్తి ఏదో ఆ హైవే జంక్షన్ తీసుకెళ్లి సరిచేయించుకుని రండి," అన్నాడు.

వాళ్లు వెళ్లిన కాసేపటికి, వహాబు అడిగితే,

"దానియేలు చనిపోయాడు వహాబూ," అప్పుడు చెప్పాడు ప్రతాపచంద్ర
"దానియేలు ఎవరండీ?" ప్రతాపచంద్రను అరవింద్ ఆసక్తిగా అడిగాడు.

## 2

**ప్రతాపచంద్ర చెప్పిన కథనం...**

దానియేలు ఈ ఊళ్లో ఆఖరి చెప్పులు కుట్టేవాడు. నేనన్నది అర్థమైంది కదా, 'కాబ్లర్.' చర్మకారుడు. అతను చనిపోవడంతో ఇక ఇప్పుడు ఆ పని చేసేవాళ్లు ఎవ్వరూ ఈ ఊళ్లోలేరు.

మా ఇంట్లో అందరి చదువులు ఈ ఊళ్లోనే సాగాయి. మా హైస్కూల్‌ను ఆనుకునే మాలపల్లి, మాదిగగూడెం ఉండేవి. అందరం కలిసే చదువుకొనేవాళ్లం. మాలపల్లి వాళ్లు వ్యవసాయం పన్లు చేసేవాళ్లు. మాదిగగూడెం వాళ్లు కూడా వ్యవసాయం పనులు చేసినా, వాళ్లలో కొన్ని కుటుంబాలవాళ్లు కులవృత్తి చేసేవాళ్లు. పొలం పన్లు కంటే, వారికది లాభసాటి అవునోకాదో తెలియదుగాని, వాళ్లాపని చేయకపోతే ఊరికి ఇబ్బంది. అంటే, నా ఉద్దేశ్యం ఊళ్లో మంగలి లేకపోతే ఎలాగో అలాగన్న మాట.

వ్యవసాయం అంటే పశువులు లేకుండా జరిగేపని కాదయ్యే. ప్రతి రైతు దొడ్లో పశువులు, పాడి ఉండేవి. దొడ్లో ఆవో గేదో ఈనితే ఇళ్లలో ఆడ-మగ పాలేళ్లు కలిసి మేనేజ్ చేసేవాళ్లు. కానీ దొడ్లో పశువు చనిపోతే మాత్రం మాదిగ రావాల్సిందే.

వాళ్లు వచ్చి దానిని తీసుకెళ్లి ఊరి బయట దూరంగా పడేసి, ఊళ్లో రైతుల ఇళ్ల మధ్య యాతన లేకుండా చూసేవారు. ఇక చెప్పులు కుట్టడం దగ్గర నుంచి వ్యవసాయానికి అవసరమైన ప్రతి తోలుపనినీ వ్యవసాయ కేలండర్ ప్రకారం మాదిగలు రైతులకు చేసిపెట్టేవాళ్లు.

ఇదిగో ఇందాక చూశారుగా, కొలిమికి గాలికొట్టే తోలుతిత్తి అది. దానిని మాదిగ తోలుకు రంధ్రం చేసి మరీ దానిలో నుంచి సన్నటి తోలు తాడుతోనే దాన్ని కుడతాడు. కాని చిత్రం! దాన్లోని గాలి బయటకు పోదు. ఒక రకంగా స్కిల్డ్ వర్క్ అది, ఒకపక్క నుంచేమో వీడు దాన్ని కుడుతున్నాడు. ఏ ఫెవికాల్‌తోనో దాన్ని అంటించడం లేదు. కానీ ఆ తోలు తిత్తిలోపల ఎయిర్‌టైట్ ఛాంబర్ తయారవుతూ ఉంది. చూడండి ఎటువంటి స్కిల్లో! అది కుట్టేవారికి ఫిజిక్స్ కూడా తెలవాలి. అయినా మనకీ వ్యవసాయం మీద శ్రద్ధ తగ్గిపోయిందండీ. వాళ్లకీ ఆ పన్లు ఇంకా ఎన్నాళ్లో బ్రతికించలేవని అర్థమైపోయింది. అందుకే అంది- అతన్ని చివరి చర్మకారుడు అని. చూశారుగా ఇప్పుడు పని ఆగిపోతే హైవే జంక్షన్‌కు వెళ్లాల్సి వచ్చింది.

ఇంకెవ్వరూ ఆ పని చెయ్యరిక్కడ.

అతనే లాస్ట్...

✤

అసిస్టెంట్ డైరెక్టర్ వాసు, ప్రతాపచంద్ర మాటల్లోని విషయాన్ని తన టాబ్‌లో సినాప్సిస్ చేస్తున్నాడు.

"దానియేలు గురించి ఇంకా చెప్పండి," అరవిందరావు అడిగాడు.

"అబ్బే గూడిపోళ్ల గురించి మనకంతగా తెలవదండీ. మన హరిలాంటోళ్లకి కొంత తెలుసుద్ది," అని, కాస్సేపాగి, "మీకు మరీ అవసరం అనుకుంటే, అక్కడోళ్లే నాతో కలిసి హైస్కూలు దాకా చదువుకున్న రాజరత్నం అని, ఇప్పుడు జాబు హైదరాబాద్‌లోనే... అతను చెప్పగలడు," ప్రతాప్ ముగించాడు.

## 3

**రాజరత్నం చెప్పిన కథనం...**

సాయంత్రం ఐదు.

"మా కొక్కిలిగడ్డ దానియేలు గురించి తెలుసుకోవడానికి మీరు నన్ను వెతుక్కుంటూ ఇక్కడదాకా వచ్చారా! ఇట్స్ స్ట్రేంజ్!"

వాళ్లంతా వనస్థలిపురం సెక్రటేరియట్ ఎంప్లాయిస్ కాలనీ పార్కులోని రావి చెట్టు క్రింద సిమెంటు బెంచీల మీద కూర్చుని ఉన్నారు.

"ప్రతాప్ చెప్పాడా? నిజమే ప్రతాప్, నేను మా ఊరు హైస్కూలు మిత్రులమే. తనది మూడవతరం జీవితం అయితే, నాది మొదటితరం జీవితం. రిటైరయ్యాక వచ్చిన డబ్బుతో హైదరాబాదులో ఓ ఇల్లు సంపాదించుకోగలిగాను. పిల్లలు ఇద్దరు బ్యాంకు, ఒకరు రైల్వే, అమ్మాయి ఎల్.ఐ.సి. అందరూ సెటిలైపోయారు.

మా దానియేలు నాకంటే పెద్దవాడు. కొన్నాళ్ల క్రితం మా ఊరు వెళితే పంచాయితీ ఆఫీసు ఎదురుగా కూర్చుని చెప్పులు బాగుచేస్తున్నాడు. మా చిన్నప్పుడు వాళ్లంతా గూడెంలో తమ ఇళ్ల ముందు చూరు క్రింద కూర్చుని చేసిన పని అది. అది కాస్తా ఇప్పుడు టౌన్లో మాదిరిగా ఊరు సెంటర్లోనా?

ఏమిటీ మార్పు అని, ఎవర్నో అడిగితే అన్నారు.

ఇప్పుడు ఊళ్లో ఆ పని చేసేది అతనొక్కడే అని.

అయినా, దానియేలు గురించి అస్సలు మీకు ఏమి కావాలో, ప్రతాప్ మీకు ఏమి చెప్పాడో తెలీదు. ఒక ఆర్డర్‌లో నేను మీకు చెప్పలేనేమోగాని, ప్రయత్నం చేస్తాను. దానియేలు తండ్రి జకర్యా. అతనిది కూడా ఇదే పని. అతని ఇద్దరు కొడుకులు ఇదే

పని. దానియేలు చిన్నవాడు అనుకుంటా. పెద్ద ఎత్తుకాదు, కొంచెం కురచగానే ఉండేవాడు. తోళ్లు పని కాస్సేపు పక్కనపెడితే, ఇతను గొప్ప పాటగాడు. ధనవంతుడు -లాజరు నాటకంలో లాజరు వేషం వేసేవాడు.

అది బైబిల్ కథ.

ఓ ధనవంతుడు ఉంటాడు, అతనికి ఐదుగురు తమ్ముళ్లు. వారి భవంతి బయట నిరుపేద లాజరు. ధనవంతుడి భోజనపు బల్లవద్ద క్రింద పడిన రొట్టె ముక్కలు తిని బ్రతుకుతాడు. చివరికి తినడానికి ఏమీ దొరకనప్పుడు ధనవంతుణ్ని ఆహారం కోసం అడిగితే, ధనవంతుడు, అతని తమ్ముళ్లు కాళ్లతో తన్ని మరీ లాజరును అవమానిస్తారు. చివరకు ధనవంతుడు, లాజరు ఇద్దరూ చనిపోతారు. లాజరు స్వర్గానికి వెళతాడు, ధనవంతుడు నరకంలో మంటల్లో ఉంటాడు. అక్కణ్నించి లాజరును చూసి, దాహం- నాలుక తడుపుకోవడానికి నాలుగు చుక్కలు నీరివ్వమని అడుగుతాడు. ఇదీ కథ.

సరే మన దానియేలు ఏమో కురచ మనిషి. రోజంతా క్రింద నేలమీద కూర్చుని చేసే పనేమో అతనికి పొట్ట కూడా ఉండేది. స్టేజి మీద చిరిగిన దుస్తులు, ఒళ్లంతా మేకప్, గాయాలు. తలకు వెనక ఉంగరాలు తిరిగిన విగ్గు, దానిమీద కట్టినఎర్రటి రిబ్బను, చేతిలో సత్తుగిన్నె.

లాజరు మైకు ముందుకు వచ్చి-

'అయ్యలారా, పలుదినములుగా అన్నపానీయములు లేక ఆకలితో నవ నాడులు కృంగి కృశించి పోవుచున్నవి...''

అంటూ పద్యం అందుకునేవాడు దానియేలు.

అంతే, ఇక మైకులు అదిరిపోవల్సిందే, అప్పటికే అర్ధరాత్రి దాటిపోయేదేమో, ఎంతకీ డ్రామా మొదలవ్వక, పట్టాలు పర్చుకుని నిద్రపోయినవాళ్లు ఒక్కసారిగా లేచి కూర్చునేవాళ్లు.

పద్యం ఆపుతూ ఉండగానే, ఈలలు, ఎవడో 'వన్స్ మోర్' అనేవాళ్లు. మన వాడు మళ్లీ ఎత్తుకునేవాడు. ఇంతలో ఎవరో వచ్చి ఐదురూపాయల నోటు దానియేలు చొక్కాకు తగిలించేవారు. ఇక డ్రామా అయ్యేదాకా దానియేలు దాన్ని తీసేవాడు కాదు.

టౌన్లో కాలేజీల్లో చదివే మేము క్రిస్మస్ సెలవులకు ఊరికి వచ్చేవాళ్లం. నేను, ప్రకాష్, అబ్రహాం, మార్టిన్- మేమంతా మా గూడెంలో కాలేజ్ కుర్రాళ్లం.

మిషన్ స్కూలు వీళ్లకు గ్రీన్ రూం. దాన్లో మరో డ్రామా నడిచేది. ధనవంతుడి ఐదుగురు అన్నదమ్ముల్లో నలుగురికే కిరీటాలు ఉండేవి. దాంతో ఐదోవాడి అలక.

మేకప్ వాడికి ఇవ్వాల్సిన సొమ్ము బేరం చేసి మరీ తగ్గించడంతో, వచ్చేప్పుడు ఒక కిరీటం తగ్గించి, చివరి నిముషంలో వాడు తన చేతి విసురు చూపించేవాడు. దాంతో రొటేషన్లో సీన్‌కి ఒకడు కిరీటం పెట్టుకునేట్టు రాజీ ఫార్ములా!

ఇవన్నీ చూస్తూ కాస్త దూరంగా నిలబడి - మా బృందం నవ్వులు.

"ఆ పొట్టేంటి, మళ్లీ ఆకలేంటి? వీడేమి లాజర్రా భాయ్?" అంటూ మా జోకులు.

అయినా, మా ఊరివాళ్లు ఆ డ్రామాలో ఆడా మగా అంతా ఇన్‌వాల్వ్ అయి పోయేవారు. కానీ చదువు పెద్దగా లేకపోయినా దానియేలు పద్యం మాత్రం గొప్పగా పాడేవాడు.

గుండ్రాయి ముందు కూర్చుంటే ఇంట్లో పొయ్యి వెలగదని, బాబు దగ్గర నేర్చుకున్న పని ఆపి కుప్ప నూర్పుళ్లప్పుడు పొలంపన్లకే వెళ్లేవాడు దానియేలు. అతని తమ్ముడు తీతు మంచి డప్పు కళాకారుడు.

"పేరేంటి?" అరవిందరావు అడిగాడు.

"యస్. ఇన్ ఇంగ్లీష్ ఇటీజ్ టైటస్, బిబ్లికల్ నేమ్," కెమేరామన్ మణి క్లారిటీ ఇచ్చాడు.

కొత్త కుర్రాళ్లు పొరుగూరు నుంచి కూడా వచ్చి అతని దగ్గర డప్పు నేర్చుకునే వాళ్లు. కొన్నాళ్ల తర్వాత ఊరికి దగ్గర్లోని పొరుగూర్లో చక్కెరమిల్లులో ఏదో పని సంపా దించుకుని ఊరు విడిచి వెళ్లిపోయాడు.

"మల్టీపుల్ విజువల్ ఫ్రేమ్స్ ఉన్న క్యారక్టర్స్... అన్నీ," అరవిందరావు తన కొలీగ్స్‌తో అంటూ, "మరి వీళ్ల ఆదాయం మాటేంటి రాజరత్నంగారూ?" అడిగాడు.

సన్నటి నవ్వుతో అన్నాడాయన, "ఏముంటుంది, అంతా- హ్యాండ్ టు మౌత్.

"మరో రెండు మూడు వారాలకు కావల్సిన తిండిగింజలు నిల్వ వీరి ఇళ్లల్లో ఉండటం, ఏడాది మొత్తంలో ఏ మూణ్నెల్లపాటో మాత్రమే వీరికి కుదిరేది. అది కూడా అందరికీ కాదు, రైతు కుటుంబంతో సంబంధం ఉండి, నాలుగైదు దొడ్లు ఉన్న మాదిగిళ్లలోనే. రైతు దొడ్లో పశువు కనుక చనిపోతే, దాని కళేబరాన్ని అక్కడ్నుంచి తరలించడం వారి మొదటిపని. దాని చర్మాన్ని ప్రాసెస్ చేసి రైతు కుటుంబానికి చెప్పులు కుట్టించి, ఎద్దులకు పట్టెడలు, ఎడ్ల బళ్ల తోలకాలకు చర్నాకోళ్లు తయారు చేయాలి. గేదె ఈనాక దూడ చనిపోతే, పాలు పితకడం సమస్య. చనిపోయిన దూడ చర్మంలో గడ్డి కూర్చి దూడబొమ్మ చేయాలి. రైతు- దాన్ని గేదె ముందు పెట్టి పాలు తీస్తారు.

“మీకు ఇది తెలుసా- కార్తీకమాసం అంటాం కదా! ఆడవాళ్లు పూజలు, ఉపవాసాలు, దీపాలు, నదుల్లో వదలడం... మా చిన్నతనంలో మాకు ఇది ఒక నెల కాదు, మూడు నెలలు పైమాటే. అందుకే మావాళ్లు కార్తీక మాసాలు అనేవాళ్లు. అంటే మూడు నెలల ఉపవాసాలు అన్నమాట. అప్పట్లో వరి ఒక్కటే పంట, షార్ట్‌టర్మ్ క్రాప్ ఉండేది కాదు. ఊడ్పులు, కలుపులు పన్లు అయ్యాక, మళ్లీ వరికోతలు వచ్చేవరకు మూడు నెలలు పైగానే ఎవరికీ పన్లు ఉండేవి కావు. వర్షాకాలం వారాల తరబడి ముసురు. చాతనైనవాళ్లు కొందరు వలలతో చేపలు పట్టి అమ్మి రోజలు గడిపితే, అదేమీలేని వాళ్లు ఒకపూట తింటే, మరోపూట ఆ సీజన్లో చెట్టుమీదనే పండి రాలి క్రింద పడే తాటిపండ్లు తెచ్చుకుని వాటిని కాల్చి తిని పూటలు గడుపుకునేవాళ్లు.

“పరస్పర విశ్వాసాలు ఉన్నవి అనుకున్నప్పుడు మాత్రం కొందరికి రైతులు- మళ్లీ పనుల రోజుల్లో తమ పొలాల్లోకి కూలీకి రావాలనే షరతుతో ఒక బస్తా లోపుగా ధాన్యం కొలిచేవారు. మరో దారేదీ లేదనుకున్నవారు, ముసిలోళ్లని ఇళ్ల వద్ద వదిలిపెట్టి నాలుగు గిన్నెలు మూటకట్టుకుని, కాల్వ చివర భూములున్న ఊళ్లలో ఊడ్పులు పన్లుకు వలసకూలీలుగా వెళ్లేవారు. చూడ్డానికి ఇది పని వెతుక్కోవడంలాగా కన్పించినా, నిజానికి ఇది ఆహారం వెతుక్కోవడమే. వలస కూలీకి వెళ్లిన రెండున్నర నెలల్లో అక్కడే కాన్పులు జరిగి పసిపిల్లల్ని చంకన వేసుకుని ఊళ్లోకొచ్చిన సంఘటనలు మా ఊళ్లో నాకు తెలుసు. అలా ఓ నవంబర్ తుఫానులో, పొరుగూళ్లో పుట్టినవాణ్ని మా ఊళ్లో అంతా ‘తుఫాన్‌గాడు’ అనే ఇప్పటికీ పిలుస్తారు, వాడిపేరు చంద్రశేఖర్. సిటీలో ఆటోనగర్‌లో పనిచేస్తాడు. ఇప్పుడు వాడు డ్యూటీకి బైక్ మీద వెళ్తుంటాడు.”

“సర్, మేము తీతును కలవాలి,” అరవిందరావు అడిగాడు.

రాజరత్నం ఆగిపోయాడు, ఆగి పరిసరాల్లోకి వచ్చి, వాళ్లను పరిశీలనగా చూస్తూ, “మీకు అక్కర్లేని సంగతులు నేను చాలా మాట్లాడినట్టున్నాను,” ఆగాడు.

“అదేంలేదు, మీరు చెప్పిన ప్రతి విషయం మాకు ఒక పాయింటే... మేం నోట్ చేసుకుంటూనే ఉన్నాం. ముందు మేము ప్రతాప్‌గారికి థ్యాంక్స్ చెప్పాలి. ఇంత రిసోర్స్ ఉన్న మిమ్మల్ని మాకు పరిచయం చేసినందుకు. మళ్లీ మేం మిమ్మల్ని కలుస్తాం.

“సర్ మరి తీతు?”

“దానియేలు కంటే ముందే తీతు చనిపోయాడు. అతని కొడుకు శుభాకర్ డప్పు కళాకారుడిగా తన బృందంతో విదేశాల్లో కూడా ప్రదర్శనలు ఇచ్చాడు. కొడుకు

చదువులు, ఉద్యోగం కూడా ఇక్కడే కావడంతో, ఇప్పుడు శుభాకర్ కూడా సిటీలోనే ఉంటున్నాడని విన్నాను.''

''చివరిగా, ఇది చెప్పండి- దానియేలు ఎలా చనిపోయాడు?'' అరవిందరావు.

(నవ్వి) ''మీకో సంగతి తెలియాలి. ప్రకృతి వైద్యుడు మంతెన సత్యనారాయణ రాజు చెబుతుంటారు. అడవిలో మృగాలకు జలుబు చెయ్యదు, జ్వరం రాదు అని. నిజానికి మాకు అంతే. చాలావరకు మావి వృద్ధాప్య మరణాలు. ఆహారపు నిల్వలు మావాళ్ల ఇంట్లోనూ ఉండవు, ఒంట్లోనూ ఉండవు. మనం పేపర్లలో చూసే వార్తలు వంటివి కాదుగాని, వృద్ధాప్యంలో ఎక్కువసార్లు మావి ఆకలి మరణాలు. నిజానికి ఇవి మిగతా వాటికంటే చాలా ప్రశాంతంగా ఉంటాయి. మంచంలో ఒంటరిగా మిగిలిన మనిషితో పాటు ఊరంతా కూడా ఆ కబురుకు సిద్ధంగానే ఉంటుంది.''

## 4

**శుభాకర్ చెప్పిన కథనం...**

నాంపల్లి, తెలుగు యూనివర్శిటి ప్రాంగణం.

ఉదయం పదకొండు.

అరవిందరావు బృందం పబ్లిక్ గార్డెన్స్ లాన్స్‌లో కనిపెడుతూ ఉండగా జానపద కళల విభాగం భవనాల వైపు నుంచి శుభాకర్ వాళ్లను వెతుక్కుంటూ అక్కడికి వచ్చాడు. ఇంతకుముందు ఎప్పుడూ చూడకపోయినా దూరం నుంచే వాళ్లు అతన్ని పోల్చుకున్నారు.

ఆజానుబాహువు. మెరుపు తగ్గిన నలుపు రంగులో ఉన్నాడు. మందపాటి ఉంగరాల జుట్టును తలకు ఎడమవైపు కురచ చేసి, కుడివైపున ఇంతెత్తుకు పెంచిన క్రాఫింగు. ఒక సైజు ప్రకారం డిజైన్ చేసి అంటించినట్టున్న మెలితిరిగిన బుర్ర మీసాలు. ఒక చేతికి గోల్డ్ చైన్ వాచీ, మరొక చేతికి రాగి కడియం. రెండు చేతి వేళ్లకు ఉంగరాలు. రాయలసీమ జిల్లాల రైతులు కట్టే పెద్ద బోర్డర్ కోరారంగు చేనేత పంచను అడ్డలుంగీగా కట్టి పైన అదే రంగు లాల్చీ, దానికి బంగారు రంగు గుండీలు. భుజం మీద ముదురు గులాబీ రంగు శాలువా. దూరం నుంచి వస్తూనే రెండు చేతులు జోడించి నమస్కారం చేసుకుంటూ కురచగా ఉన్న క్రోటన్స్‌ను అంగవేసి దాటుకుంటూ లాన్స్‌లోకి వచ్చాడు. ముందుభాగంలో సన్నగా మొన తిరిగి నగిషీలు చేసిన తోలు చెప్పులు.

అంత దూరం నుంచి అతన్ని చూస్తూనే పోల్చుకుని, వాళ్లంతా కూర్చున్న ఆ లాన్స్‌లోనే కొంచెం వెనక్కి వాలి రిలాక్సింగ్‌గా కుదురుకున్నాడు అరవిందరావు. ఫిల్మ్

స్క్రిప్ట్ పని దశలో అతని దేహభాష- కెమెరామెన్ మణి, అసిస్టెంట్ డైరెక్టర్ వాసులకు మొదటినుంచి తెలుసు. పాత్రల పరోక్షంలో, వాళ్ల గురించి ఇప్పటివరకూ విన్నదానిని మొదటిసారి భౌతికంగా ఆ పాత్రలకు అన్వయించడం, ఇప్పుడు తను చేస్తున్న పని. కొన్ని నిముషాలపాటు అతనలా ట్రాన్స్‌లో క్యారెక్టర్ల అంతర్లోకాలలోకి వెళతాడు. అటువంటి సందర్భాలలో వాసు నోట్సు రాసుకుంటాడు.

ఆ సమయంలో- అతని ఫిల్మ్‌లోని పాత్రల ఆత్మలు రూపుదిద్దుకుంటాయి. అప్పుడు పరిసరాల్ని అతను పెద్దగా పట్టించుకోడు.

“క్షమించాలి, మీరు నాకోసం కనిపెట్టవలసి వచ్చింది. మంగళవారం, శుక్ర వారం నేను ఇక్కడ డప్పుక్లాసు టీచ్ చేస్తాను. ఇల్లు బాగా దూరం, ఇక్కడైతే సిటీ కనుక మీకు తేలిగ్గా ఉంటుందని ఇక్కడ కలుద్దామన్నాను. రాజరత్నం సార్ చెప్పారు మీ గురించి. నిజానికి నాకు ఆయన తెలియదు. కాని నాకు కూడా తెలియని మా ఊరు సంగతులు ఆయనకు చాలా తెలుసు. నా నెంబర్ తెలుసుకుని మరీ మీకు ఇచ్చారట, చెప్పారు మిమ్మల్ని కలవమని.”

శుభాకర్ ఆగాక, అప్పటికిగాని వాళ్లు కుదుటపడలేదు.

మొదట అతని స్వరానికి సర్దుబాటు కావడం వాళ్లకు కొంచెం యాతన అయింది. మాటతీరు అలవోకగా చెబుతున్నట్టే ఉందిగాని, ఆ శబ్దం ఏళ్ల తరబడి తెరవని కోటగుమ్మం తలుపులు భారంగా తెరుస్తున్నప్పుడు వచ్చే ధ్వనిలాగా భారమైన జీరగా ఉంది.

“నాన్నే నా గురువు. షుగర్ మిల్లు డ్యూటీకి వెళ్లి వచ్చి, రాత్రిపూట అన్నాలు తిన్నాక ఊళ్లో మా లక్ష్మిమాను దగ్గర చేరే కుర్రాళ్లకు వెన్నెల వెలుతురులో నాన్న పలక (డప్పు) కొట్టడం నేర్పేవాడు. వాళ్లంతా పీటలు తెచ్చుకుని వాటి మీద చిటికె వెయ్యడంతో మొదలయ్యేది విద్య. అలా ఒక్కొక్క దరువు అంచెలంచెలుగా నేర్పే వాడు. మంద్రస్థాయి ఎక్కువ రోజులు నేర్పేవాడు. అది స్పష్టంగా వినబడుద్ది. పలకలు ఎన్నున్నా ఒక్క చిటికే వినబడాలి అనేవాడు. దానికి టైమింగ్ పర్‌ఫెక్ట్‌గా ఉండాలి. అది కష్టం. తారాస్థాయి అలా కాదు. ఇలా మొదటి స్టెప్పు అయిపోయాక, ఇందులో పాసైనవాళ్లకే ఆయన భుజాలకి పలకలు తగిలించేవాడు. వాటి మీద అన్ని దరువులు అనిపించాక, మళ్లీ వాటిని ఒక్కొక్కళ్లతో చేయించేవాడు. ఇదయ్యాక- అప్పుడు అడుగు వెయ్యడం.

“నడుముకు కట్టు లేకుండా అడుగెయ్యాటానికి వీల్లేదనేవాడు. ముందు లంగోటాలు కట్టాలి. ఆ తర్వాత అందరూ పంచెలు బిర్రబిగదీసి కట్టి, ఆ పైన నడుం కట్టిన తర్వాత కాళ్లకు గజ్జెలు కట్టి పలకలు తగిలించుకుని వరసగా నిలబడితే- నాన్న ఒక్కొక్క అడుగు తాను వేసి మాతో వేయించేవాడు. చిటికె, అడుగు రెండూ ఒక్కటిగా ఉండాలి, ఏ మాత్రం తేడా వచ్చినా పక్కన ఉంచుకునే చింతబరికెతో కాళ్లమీద కొట్టేవాడు. మొత్తం పన్నెండు రకాల స్టెప్పులు నేర్పేవాడు. ఆట ముగించే ముందు అన్నిటికంటే ఎనకమాల మేము చేసే స్టెప్పుల కోసం జనం అంతా అలా కాసుకుని ఉండేవాళ్లు.

“నాన్న దగ్గర నేర్చుకున్న ట్రూపుల వాళ్లే అది చేసేవాళ్లు. అది ఇలా ఉండేది ‘క్యూలైన్’ మాదిరిగా ట్రూపంతా నిలబడుతుంది. మంద్రంగా చిటికె మొదలుపెట్టి వన్... టూ... త్రీ.. ఫోర్ అంటూ... క్రమంగా తారాస్థాయిలోకి వెళ్తూ టెన్ దగ్గర పెద్ద అంగతో రౌద్రంగా ఉన్నచోట నుండి అదాటుగా ఎడమకు దూకడం!!

“అక్కణ్నించి మళ్లీ మంద్రంలో ఆడపిల్లల్లా నడుము తిప్పుతూ చిన్న చిన్న అడుగులతో యథాస్థానానికి రావడం. కర్రబద్దల్లాగా ఉండే నూనూగు మీసాల కుర్రాళ్లు అమ్మాయిల్లా నడుం తిప్పుతూ అడుగేస్తూ చిటికెయ్యడాన్ని జనం కన్నార్ప కుండా చూసేవారు. ఒక రకంగా అర్ధనారీశ్వరాన్ని ఆయన అలా డప్పుకు మల్చాడు. ఫ్రాన్స్‌లో మేము ఇచ్చిన ప్రదర్శనను ఫ్రెంచ్ టివి 20 నిముషాలు ప్రసారం చేసింది.

“నాన్న తర్వాత నా ట్రూపు ప్రదర్శనకు నేను పాటను కూడా కలిపాను. అయితే రోజులు గడుస్తున్నకొద్దీ చర్మం డప్పులు పోయి సింథటిక్ డప్పులు వచ్చాయేమో, పాతరోజుల్లో మాదిరిగా మంద్రం ఇప్పుడు పలకడం లేదు. డప్పులు అంటే- ఇప్పుడు అంతా గోల క్రింద అయిపోయింది. చిటికె మధ్య పాట వినబడ్డానికి గొంతు చించి పాడాల్సి వచ్చేది. దాంతో డప్పు ప్రదర్శనల్లో ప్లే బ్యాక్ కూడా నేనే పరిచయం చేశాను. స్టేజి మీద మైకు ముందుకొచ్చి పాట ఎత్తుగడ తీసుకుని చిటికెతో అడుగు మొదలు పెడతాం. అంతే, ఇక పాటను స్టేజి ముందు కూర్చున్న మా బృందం మైకుల్లోంచి అందుకుంటుంది. చిటికె, అడుగు ఈ రెండే మా పని. అలా కొంత శ్రమ తగ్గింది.

“ఇక- యాభై దాటాక, నేనూ మరో మూడు ట్రూపులు తయారుచేసి పలక తగిలించుకోవడం క్రమంగా తగ్గించివేశాను. మూడేళ్ల క్రితం అనుకోకుండా ఒకరోజు మా సతీష్‌తో అన్నపూర్ణా స్టూడియోస్‌కి వెళ్లాను. అంతే, ఆ తర్వాత ఊరి నుంచి మకాం సిటీకి మార్చాల్సి వచ్చింది.

## 5

**సతీష్ టైటస్ చెప్పిన కథనం...**

అన్నపూర్ణ స్టూడియోలో రికార్డింగ్ కాంప్లెక్స్ ముందున్న క్యాంటీన్‌లో ఓ మూల కిటికీ పక్కన కూర్చున్నారు వాళ్లంతా.

"నా ఏరియాలో డాడీ, డాడీ ఏరియాలో నేను ఎలా ఫిటిన్ అవుతామో నాకు తెలియదు. సర్, మీరు అడుగుతున్నారు కనుక చెబుతున్నాను. నాది సోషల్ లాంగ్వేజ్ ఏరియా, డాడీది పూర్తిగా సౌండ్ ఏరియా.

"ఇట్ ఆల్ సో హేపెన్డ్, అదలా జరిగిందంతే... ఎలా జరిగిందంటే, నేను చెప్పలేను.

"హైదరాబాద్ యూనివర్శిటీలో మేం ముగ్గురం ఫ్రెండ్స్‌మి. వాళ్లలో తెలుగు వాణ్ని నేను ఒక్కణ్నే. ఒకరు పొలిటికల్ సైన్స్, ఇద్దరం సోషియాలజీ. అక్కణ్నించి ముగ్గురం 'ఇఫ్లూ' (EFLU-ఇంగ్లీషు అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్శిటి)కు వెళ్లాం. అక్కడ ఐడియా ఇది. క్యాంపస్ నుండి బయటకొచ్చాక పార్ట్ టైం జాబ్స్ చేస్తూ డెవలప్ చేశాం. మేం మా- *మైండ్ యువర్ లాంగ్వేజ్* కన్సల్టెన్సీ స్టార్ట్ చేసి ఇది సెవన్త్ ఇయర్. ఇప్పుడు మా హైదరాబాదు స్టాఫ్, ఫ్యూన్స్‌తో కలిపి పాతికమంది.

"తెలుగులో మాకు పెద్దగా పని ఉండదు. అంతా హిందీయే. సినిమా స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నప్పుడే డైరెక్టర్స్ మాకు క్యారెక్టర్స్ ప్రొఫైల్స్ ఇస్తారు. వాటిమీద హోం వర్క్ చేస్తూ ఉండగా, తర్వాత దశలో సంభాషణల స్క్రిప్ట్ మాకు ఇస్తారు. మా అస్సలు పని అప్పట్నించే మొదలవుతుంది. ఆ పాత్రల సంభాషణలకు లాంగ్వేజ్ స్టైయిల్ మేము ఇస్తాము. కారక్టర్‌ను బట్టి భాష, ఉచ్చారణ, మాండలికం, మాటవిరుపు వీటన్నిటి మీద మేం టీం వర్క్ చేసి డైరెక్టర్స్‌కి నోట్స్ ఇస్తాం. అవసరమైతే, లీడ్ క్యారక్టర్స్ కనుక పాపులర్ యాక్టర్లయితే మాడ్యులేషన్ కోచింగ్ సెషన్స్ కూడా ఇస్తాము.

"సర్, మీరు వెటరన్... మీకు నేను ఏమి చెబుతాను?

"అంతా పోస్ట్-మండల్ ఎఫెక్ట్ సర్!

"నేటి బాలీవుడ్ క్యారెక్టర్స్ ఒకప్పుడు 'బీమారు'గా పిలువబడే బీహార్, మధ్య ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ గ్రామాల్లోకి వచ్చేశాయి. ఇప్పుడవి నాలుగు కాదు, వాటిల్లో నుంచి మరొక మూడు క్రొత్తవి వచ్చి- మొత్తం ఏడు అయ్యాయి. దాంతో అక్కడ ఇప్పుడు కొత్తగా కొన్ని రీజనల్ లాంగ్వేజెస్ వాడకంలోకి వచ్చాయి. వాటిమీద మేం మా దృష్టి పెడుతున్నాం.

"స్క్రిప్ట్‌కు ఇప్పుడు మేము అదనంగా ఇస్తున్న ఇన్‌పుట్స్ వల్ల బాలీవుడ్ సినిమాలు మల్టిప్లెక్స్‌లతో సమానంగా 'సి' క్లాస్ సెంటర్లలో కూడా మంచి బిజినెస్ చేస్తున్నాయి. ఇప్పటికే అది అక్కడ ఫిల్మ్ ఛాంబర్స్ కూడా ఒప్పుకున్నాయి.

''మేం కూడా ఎక్స్‌పాండ్ అవుతూ చిన్న హీరోల సినిమాలయితే, స్టైల్స్, కాస్ట్యూమ్స్, సెట్, ప్రాపర్టీస్ కూడా ఇస్తూ యూనిట్ పని తేలికచేస్తున్నాం. ఢిల్లీ జె.ఎన్.యు. క్యాంపస్‌లో మా ఫ్రెండ్స్ టీమ్ ఒకటుంది. సోషల్ నెట్‌వర్కింగ్‌తో మేము పని షేర్ చేసుకుంటూ ఉంటాం.

''ఇండస్ట్రీ గురించి మీకు తెలుసు, కట్ త్రోట్ బిజినెస్ ఇది. అందుకని క్యారెక్టర్‌కి ఒక ఐడి నెంబరు ఇస్తాం, దాంతో ఎవరు ఎవరికోసం పనిచేస్తున్నారో ఎవరికి తెలియదు. ప్రిసైస్లీ ఇది మా మైండ్ యువర్ లాంగ్వేజ్ ప్రొఫైల్.

''సారీ, మీరు నన్ను అస్సలు ఏమి అడగడానికి వచ్చారో తెలీదు.'' సతీష్ ఆగాడు.

''అదేం లేదు సతీష్, ఇట్స్ జస్ట్ ఇన్‌ఫార్మల్ ఛాట్,'' అసిస్టెంట్ డైరెక్టర్ వాసు స్పష్టం చేశాడు.

''మీ డాడీ...'' అరవిందరావు ఆగాడు.

సతీష్ నవ్వుతూ-

''ఇక్కడే ఒక డబ్బింగ్ సెషన్‌కు ఊరికే టైంపాస్‌కు డాడీ నాతో వచ్చారు. ఓ సీనియర్ సౌండ్ ఇంజనీర్- డాడీ వాయిస్ విని, రికార్డ్ చేశారు.

''ఓ వారం తర్వాత ఫోన్- ఓ కార్టూన్ నెట్ వర్క్ సిరీస్‌కు డబ్బింగ్ చెబుతారా? అని.

''నాకూ అది మంచి ఆఫర్ అన్పించింది. ఊళ్లో అమ్మ హెల్త్ కూడా దెబ్బతింది. అప్పటికే వాళ్లను విలేజ్ నుంచి నా దగ్గరకు తెచ్చుకోవడం గురించి ఆలోచిస్తున్నాను. అంతే ఇదంతా ఆ రోజు అలా మొదలైంది.

''ఇప్పుడు ఆయన బిజీయస్ట్ డబ్బింగ్ ఆర్టిస్ట్ (నవ్వుతూ). భాష ఏదైనా కాలమే దైనా- అసుర క్యారెక్టర్స్ అన్నిచోట్లా ఉంటాయి కదా. కార్టూన్ నెట్‌వర్క్ డబ్బింగ్ ఆర్టిస్ట్ సర్కిల్‌లో ఇప్పుడు ఆయన పేరు మోసిన రాక్షసుడు, పులి, సింహం, అన్నీ!! వీక్లీ టూ డేస్ అనుకుంటా తెలుగు యూనివర్శిటీ ఫోక్ డిపార్ట్‌మెంట్‌లో గెస్ట్ ఫ్యాకల్టీగా చేస్తారు.

''సర్ ఓ ముఖ్యమైన పని మధ్యలో ఆపి వచ్చాను మీరేం అనుకోకపోతే ప్లీజ్... మరోసారి నేనే మీ ఆఫీస్‌కు వస్తాను.''

సతీష్ బైటకు వెళ్లిపోయాడు.

అరవిందరావు యూనిట్ క్యాంటీన్లోంచి బయటకు వస్తున్నప్పుడు, వాళ్లకు ఎదురైన వ్యక్తిని చూసి గుర్తుపట్టి ఆగారు. గ్రే కలర్ సఫారీ, బ్లాక్ హాఫ్ షూస్, కళ్లద్దాలు, చేతిలో ప్లాస్టిక్ పేపర్ ఫోల్డర్.

అనుకోకుండా వాళ్లంతా ఒకేసారి విష్ చేసుకున్నారు.

అతను 'డప్పు శుభాకర్.'

**6**

**అరవిందరావు ఇల్లు...**

వాళ్లంతా హాల్లో ఉన్నారు.

టీ పాయ్ మీద స్క్రిప్ట్‌బౌండ్.


వాసు తన ట్యాబ్‌లో అప్పుడే వచ్చిన మెయిల్స్ చూస్తూ, "సర్ మన టైటిల్ రిజిస్ట్రేషన్ అయిపోయింది!"

ఇదిగో-

"డెత్ ఆఫ్ ఎ లాస్ట్ కాబ్లర్," వాసు తన ట్యాబ్ వాళ్లకు చూపిస్తున్నాడు.

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*22 ఫిబ్రవరి 2015*

❋



4 సెప్టెంబర్ 1956న కృష్ణా జిల్లా, కోలవెన్నులో జన్మించిన చోరగుడి జాన్సన్‌పి. చి మొదటి కథ **మట్టిపక్షులు** 18-25 మార్చి, 2003లో ఇండియా టుడేలో అచ్చ య్యింది. పదిహేనుకు పైగా కథలు రాశారు. సామాజిక అంశాలపై ఒక వ్యాససంపుటి ప్రచురించారు. త్వరలో కథాసంపుటి రాబోతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార పౌర సంబంధాల శాఖలో ఉన్న తాధికారి.

***చిరునామా: 54-19-10ఎ, జయప్రకాశ్‌నగర్, విజయవాడ - 520 008***
***ఫోన్: 98662 24828***
***johnson.choragudi@gmail.com***